

ఆత్మవిశ్వాసమే ఆలంబనగా..

ఆత్మవిశ్వాసం, పట్టుదలతో వివిధ రంగాల్లో రాణిస్తూ దివ్యాంగులు శభాష్ అనిపించుకుంటున్నారు.

- 8లో



'లగచర్ల' పునరావృతం చేస్తాం

'ట్రిపుల్‌ఆర్' బాధితులకు న్యాయం చేయకుంటే లగచర్ల ఘటన పునరావృతం అవుతుందని నిర్వాసితులు హెచ్చరించారు.

- 10లో



సంగం డెయిరీ ఎదుట ధర్నా

నంగం డెయిరీ ఎదుట కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై వివిధ గ్రామాల ప్రజలు ధర్నా నిర్వహించారు.

- 10లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని డీవీకే రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎండీ. యూసఫుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ 11వ తేదీ లోపు దరఖాస్తుతోపాటు టీసీ, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్, కుల ధృవీకరణ పత్రం జిరాక్స్ సమర్పించాలన్నారు. వివరాలకు 798 1098521 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

యువజన, క్రీడల అధికారిగా కుంభం నర్సిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న కుంభం నర్సిరెడ్డి

నల్లగొండ టూటౌన్: యువజన, క్రీడల శాఖ (డీవైఎస్‌ఓ) జిల్లా అధికారిగా కుంభం నర్సిరెడ్డి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కనగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నర్సిరెడ్డికి డీవైఎస్‌ఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. నర్సిరెడ్డి గతంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీగా పనిచేశారు. జిల్లా కేంద్రంలో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఈఓ భిక్షపతిని నర్సిరెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ ఉద్యోగులు, అభినందనలు తెలియజేశారు.

'సీఎం కప్'కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగనున్న సీఎం కప్–2024 లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఈ నెల 5వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ స్థాయి, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పాల్గొనే క్రీడాకారులు తమ వివరాలను cmcup2024.tealngana.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పీడీలు, పీఈటీలు, హెడ్మాస్టర్లు గురుకులాల ప్రిన్సిపాళ్లు చొరవ చూపి తమ పాఠశాలల క్రీడాకారులను కేటగిరివారీగా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు.

11న నీటి విడుదల

డిండి: ప్రాజెక్టులో నీళ్లు నిండుగా ఉన్నప్పటికీ పంట పొలాలకు విడుదల చేయకపోవడంతో ఆదివారం సాక్షి దినపత్రికలో నీళ్లు నిండుగా..ఆశలు మెండుగా అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఇరిగేషన్ అధికారులు సోమవారం డిండి మండల కేంద్రంలోని నీటి పారుదల శాఖ అతిథి గృహంలో డిండి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే విషయంపై రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతుల అభిప్రాయం మేరకు యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటల సాగుకు నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఈఈ శ్రీధర్ రావు తెలిపారు. డీఈ శ్రీనివాస్, ఏఈ సాయి కృష్ణ, వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.





దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో నిర్మిస్తున్న యాదాద్రి పవర్ ప్లాంట్

యాదాద్రి పవర్‌ప్లాంట్ ప్రారంభానికి సన్నాహాలు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో నిర్మిస్తున్న యాదాద్రి పవర్ ప్లాంట్‌లో యూనిట్–2ను ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు యూనిట్ల పనులు పూర్తి కాగా మరో మూడు యూనిట్ల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇటీవలే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు పనులు పూర్తయిన రెండు యూనిట్లలో సింక్రనైజేషన్ స్విచ్ ఆన్ చేశారు. ప్లాంట్‌లోకి బొగ్గు రవాణా కోసం విష్ణుపురం నుంచి ప్లాంట్ వరకు సుమారు 8 కి.మీ మేర రైల్వే ట్రాక్ నిర్మించగా ఇటీవల మంత్రులు ప్రారంభించారు. ఉద్యోగులకు సంబంధించిన వసతి గృహాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. 2025 మే నాటికి మిగిలిన మూడు యూనిట్ల పనులు సైతం పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ!

చిన్నపాటి జ్వరం వచ్చినా అన్ని రకాల పరీక్షలు

- ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ఆస్పత్రుల యాజమాన్యం
- ఫీజుల వివరాలు డిస్‌ప్లే చేయని వైనం
- నామమాత్రంగా వైద్యాధికారుల తనిఖీలు



నల్లగొండ టౌన్ : జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. ఇష్టానుసారంగా రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టుకు వ్యతిరేకంగా ఆస్పత్రుల నిర్వాహకులు డబ్బు సంపాదనే ధ్యేయంగా రోగుల నుంచి ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. యాక్టు ప్రకారం ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్‌లలో అందిస్తున్న వైద్య సేవలు, టెస్టులు, వాటి ధరల వివరాలను ఆస్పత్రి ఆవరణలో బోర్డుపై తెలుగులో రాసి ప్రదర్శించాలి. కానీ జిల్లాలో పదుల సంఖ్యలో మాత్రమే యాక్టు ప్రకారం ఫీజుల వివరాలను ప్రదర్శిస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పేరుతో ఆస్పత్రుల యాజమాన్యాలు యాక్టు నిబంధనలను పట్టించుకోకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయి.

జిల్లాల్లో దాదాపు 546 ప్రైవేట్ ఆస్పత్రులు

నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా, నకిరేకల్, కొండమల్లేపల్లి, చండూరు తదితర పట్టణాల్లో ప్రధానంగా ఆర్థోపెడిక్, కార్డియాలజీ, న్యూరాలజీ, గైనకాలజీ, నెఫ్రాలజీ, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, కంటి తదితర విభాగాలకు చెందిన ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 546 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. అందులో అనేక ఆస్పత్రుల్లో ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ కొన్ని ఆస్పత్రుల్లో అత్యవసర పరిస్థితుల సాకు చూపి ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు అందించకుండా లక్షల రూపాయలను రోగుల బంధువుల నుంచి వసూలు చేస్తున్నారు. చికిత్స అందించిన తరువాత ఆరోగ్యశ్రీ కింద తిరిగి బిల్లులు పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అనేక ఆస్పత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఫీజులు వసూలు చేస్తున్నారు. చిన్న జ్వరం వచ్చి ఆస్పత్రికి వెళ్లినా డెంగీ, గుండె, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, మూత్ర, రక్త, మలేరియా టైఫాయిడ్ వంటి అన్ని రకాల పరీక్షలు చేయించి పరీక్షల పేరుతో వేలకు వేల రూపాయలు దండుకుంటున్నారు.

తనిఖీలు పెంచితేనే..

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు పెంచాల్సిన అవసరం ఉంది. జిల్లాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితోపాటు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రాం అధికారులు, ఇతర అధికారులు ఉన్నారు. వారందరూ విధిగా ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు అమలు చేస్తున్నారా లేదా అని తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ నామమాత్రంగా తనిఖీలు చేస్తుండడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి ప్రైవేట్ ఆస్పత్రుల్లో యాక్టును అమలు చేయించి ఫీజుల దోపిడీని అరికట్టాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో కచ్చితంగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు అమలు చేయాలి. యాక్టుకు విరుద్ధంగా వ్యవహరించే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ ఆస్పత్రులపై తనిఖీలు నిర్వహించి ఫీజుల దోపిడీని అరికట్టడానికి చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్‌పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ

మెడికల్ విద్యార్థులకు కోమటిరెడ్డి చేయూత



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

చిట్యాల: పేద కుటుంబాలకు చెందిన చిట్యాల మండలంలోని విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించి మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించారు. కానీ అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ ఇటీవల తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి.. మెడికల్ సీట్లు సాధించిన చిట్యాల మండలం ఎలికట్టె గ్రామానికి చెందిన గుండె యుగేందర్, వెలిమినేడు గ్రామానికి చెందిన అంతటి శశిప్రకాష్, గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన రుద్రారపు కావేరిలను సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసానికి పిలిపించుకున్నారు. విద్యార్థులకు వచ్చిన మెడికల్ ర్యాంకులు, సీట్లు వచ్చిన కాలేజీలు, కాలేజీకి ప్రతిఏటా చెల్లించాల్సిన ఫీజుల వివరాలు తెలుసుకున్నారు. ఏడాదికి ఒక్కొక్కరికి రూ.65 వేల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని విద్యార్థులు మంత్రికి వివరించారు. ఐదేళ్లపాటు తానే మెడికల్ కాలేజీ ఫీజులు కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా చెల్లిస్తానని మంత్రి విద్యార్థులకు హామీ ఇచ్చారు. విద్యార్థులు సీట్లు సాధించిన కాలేజీల బ్యాంకు అకౌంట్‌లకు సోమవారం నేరుగా మొదటి ఏడాది ఫీజు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బండ గిరిజ అంజయ్య, చెరుకు సైదులు, గుడిపాటి శివసాయి వెంకటవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులను తిప్పించుకోవద్దు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

నల్లగొండ : ఫిర్యాదుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం అధికారులతో మాట్లాడారు. కాగా ప్రజావాణిలో 66 మంది ఫిర్యాదులు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌ఓ అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్ లోగో ప్రదర్శించాలి

రామగిరి(నల్లగొండ): ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ రైజింగ్ నంబర్ వన్ లోగోను అన్ని ప్రింట్, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ప్రదర్శించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో జిల్లా అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. 3న ఎన్జీ కాలేజీ నుంచి క్లాక్ టవర్ వరకు 2కే రన్, మిర్యాలగూడ మున్సిపాలిటీలో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం, నకిరేకల్, చండూరు, హాలియా మున్సిపాలిటీల్లో ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ, 4న మొక్కలు నాటడం, ర్యాలీలు నిర్వహించాలన్నారు. 5న డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ, నల్లగొండలో నూతనంగా నిర్మించిన ఐటీఐ ప్రారంభిస్తారని తెలిపారు. 6న వైటీపీఎస్ ప్రారంభం, 7న పోలీసు, అగ్నిమాపక శాఖల కార్యక్రమాలు, 8న ఐటీఐ టవర్ విద్యుదీకరణ చేపట్టాలన్నారు.

ఆరోగ్య ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్

నల్లగొండ అగ్రికల్చర్ : ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో ఆరోగ్య ఉత్సవాల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లీనిక్, ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, నర్సింహారావు పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్ క్లినిక్ ప్రారంభోత్సవంలో కలెక్టర్

ఫుడ్ పాయిజన్.. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కుట్ర

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

నల్లగొండ: రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజకీయ కుట్ర అని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ ఆరోపించారు. సోమవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలపై ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధి చేస్తోందన్నారు. దీనిని జీర్ణించుకోలేక ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. కేసీఆర్‌కు ఊడిగం చేస్తూ గురుకుల హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ కుట్రకు తెరలేపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ కుట్రలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కత్తుల కోటి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్ రెడ్డి, రేగట్టె లింగస్వామి గౌడ్, చింతపల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్

సీపీఎంకు పూర్వ వైభవం తీసుకొస్తాం

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు

మిర్యాలగూడ : రానున్న రోజుల్లో బలమైన ప్రజా పోరాటాలు నిర్వహించి సీపీఎంకు పూర్వ వైభవం తీసుకొస్తామని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు అన్నారు. సీపీఎం జిల్లా 21వ మహాసభల సందర్భంగా సోమవారం మిర్యాలగూడలోని ఎన్ఎస్పీ క్యాంపులో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాల బాంబులు పేలుస్తామని అన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు అప్పజెబుతున్నారని విమర్శించారు.

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ బీజేపీ చాలా ప్రమాదకరమని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం చేసిన ఉద్యమాల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నాయని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, సయ్యద్ హాశం, కందాల ప్రమీల, ప్రభావతి, నాగార్జున, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, బండా శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, అయూబ్, రాగిరెడ్డి మంగారెడ్డి, పరుశురాములు, వరలక్ష్మీ, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో జరిగిన బహిరంగ సభలో వేదికపై అభివాదం చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ

సీపీఎం జిల్లా 21వ మహాసభల సందర్భంగా మిర్యాలగూడలో సోమవారం ఎర్రదళం కదం తొక్కింది. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు, జెండాలు, ప్రధాన రహదారిపై తోరణాలతో అలంకరించారు. సోమవారం మధ్యాహ్నం హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ఎన్ఎస్పీ క్యాంపు వరకు మహా ప్రదర్శన నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలతో వేలాది మంది ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి ప్రదర్శన నిర్వహించారు.3 గంటలకు ప్రారంభమైన మహా ప్రదర్శన 4గంటలకు ఎన్ఎస్పీ క్యాంపునకు చేరుకుంది. 4 గంటలకు బహిరంగ సభ ప్రారంభం కాగా 5.15 గంటలకు ముగిసింది.



ర్యాలీలో పాల్గొన్న రాఘవులు, జూలకంటి, లక్ష్మి, ముదిరెడ్డి తదితరులు

ఫిర్యాదుల స్వీకరణ

నల్లగొండ క్రైం : పేదలకు పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరిగితేనే పోలీస్ శాఖపై భరోసా కలుగుతుందని ఏఎస్పీ రాములునాయక్ అన్నారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని సంబంధిత ఎస్ఐలకు సూచించారు.

7 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

నల్లగొండ : ఒలింపిక్ క్రీడల్లో మెడల్స్ సాధించే దిశగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఈ నెల 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తారన్నారు. జిల్లా స్థాయిలో ఈ నెల 16 నుంచి 21 వరకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తారన్నారు. 2028 లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌లో రాష్ట్రం నుంచి మెడల్స్ సాధించే దిశగా క్రీడాకారులను తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌ఓ అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా స్పోర్ట్స్ అధికారి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

స్కూల్ కాంప్లెక్స్‌లకు నూతనోత్తేజం

- రూ.33 లక్షలు విడుదల చేసిన ప్రభుత్వం
- నిధులను సమావేశాలు, నిర్వహణకు వినియోగించనున్న విద్యాశాఖ అధికారులు
- జిల్లాలో 250 ఉన్నత పాఠశాలల్లో 100 స్కూల్ కాంప్లెక్స్‌లు



నల్లగొండ : స్కూల్ కాంప్లెక్స్‌లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాలో దాదాపు 250 ఉన్నత పాఠశాలల్లో 100 స్కూల్ కాంప్లెక్స్‌లకు నిధులు విడుదలయ్యాయి. ఉన్నత పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయిస్తారు. కాంప్లెక్స్‌లకు మాత్రం ప్రత్యేక నిధులు అందిస్తారు. ఈ నిధులను కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయుల బోధన సామర్థ్యం పెంపు, నిర్వహణ కోసం వెచ్చించనున్నారు. గతంలో రెండు విడతలుగా విడుదల చేసిన ప్రభుత్వం.. ఈసారి ఒకేసారి నిధులు విడుదల చేసింది.

ఒక్కో కాంప్లెక్స్‌కు రూ.33 వేలు..

జిల్లాలో ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్న 100 కాంప్లెక్స్‌లకు ఒక్కో దానికి రూ.33 వేల చొప్పున జిల్లాలోని 100 కాంప్లెక్స్‌లకు రూ.33 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో దాదాపు 10 నుంచి 15 పాఠశాలల వరకు పాఠశాలలు ఉన్నాయి.


బోధనా సామర్థ్యం పెంపునకు..

ప్రభుత్వం కాంప్లెక్స్‌లకు విడుదల చేసిన నిధులను కాంప్లెక్స్ నిర్వహణ కోసం వినియోగిస్తారు. ప్రధానంగా ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు ప్రతినెలా కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తారు. ఇందులో ఉపాధ్యాయులు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను తయారు చేయాల్సి ఉంటుంది. మెటీరియల్ తయారీతోపాటు వాటిని జిరాక్స్ తీయడం, తదితర ఖర్చులకు ఈ నిధులను వినియోగిస్తారు. విద్యార్థులకు ఏమి బోధించారు.. రాబోయే నెలరోజుల్లో ఎలాంటి బోధన చేస్తారు అనే అంశాలపై ప్రతినెలా సమావేశంలో చర్చిస్తారు. సమావేశంలో టీ, పేపర్లు, ప్రింట్లు, ఇంటర్ నెట్, ఫోన్ బిల్లు, ట్రావెల్ చార్జీలకు ఈ నిధులను వినియోగించాలి.

కాంప్లెక్స్ హెచ్‌ఎంల ఖాతాల్లోకి..

ఇప్పటికే ప్రభుత్వం స్కూల్ కాంప్లెక్స్‌లకు నిధులను విడుదల చేసింది. అవి జిల్లాకు చేరాయి. వాటిని జిల్లాలోని 100 స్కూల్ కాంప్లెక్స్‌ల ఖాతాల్లో జమచేయనున్నారు.

నిర్వహణకు వినియోగించాలి



ప్రభుత్వం విడుదల చేసిన నిధులను స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ కోసం వినియోగించాలి. ప్రతినెలా కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులతో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సమావేశం నిర్వహించాలి. విద్యార్థులకు నూతన పద్ధతుల్లో విద్యాబోధనపై చర్చించడంతోపాటు గడిచిన మాసంలో జరిగిన తరగతులపై చర్చించాలి. టీచింగ్, లెర్నింగ్స్ ఉపాధ్యాయులు మెటీరియల్ తయారు చేయాలి. ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ కోసం కూడా ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

–భిక్షపతి, డీఈఓ

క్లుప్తంగా

కుక్కల దాడి.. వృద్ధురాలికి గాయాలు


గాయపడిన లచ్చమ్మ

నడిగూడెం: మండల పరిధిలోని కరివిరాల గ్రామానికి చెందిన వృద్ధురాలు పాతకొట్ల లచ్చమ్మ సోమవారం తన ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా కుక్కలు ఆమెపై దాడి చేశాయి. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకుని లచ్చమ్మను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నార్కట్‌పల్లి: మండలంలోని మాధవ యడవల్లి గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. మాధవ యడవల్లి గ్రామానికి చెందిన వేమిరెడ్డి జనార్దన్‌రెడ్డి తన గేదెను సోమవారం మేతకు తీసుకెళ్తుండగా.. గ్రామంలోని సబ్ సెంటర్ సమీపంలో ఎలాంటి రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగానే గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.80వేల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు.

జూదరుల అరెస్ట్

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల కేంద్రంలో సోమవారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పక్కా సమాచారం మేరకు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. అరెస్టయిన వారిలోగజ్జెలి రవి, మేకల చంద్రయ్య, గూడెపు వెంకన్న, చిన్నం మహంకాళి, మందుల నరసింహ, చెడేపల్లి అంజయ్య, ఎలిజాల దయాకర్, గూడెపు పరమేశ్ ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.2500 నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్ట్


నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కోదాడరూరల్: గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను కోదాడ ఎక్సైజ్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండల పరిధిలోని చిమిర్యాల బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 250 గ్రాముల గంజాయి పట్టుబడింది. అదేవిధంగా కోదాడ పట్టణ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకుల వద్ద 150 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈ రెండు కేసుల్లో పట్టుబడిన 400 గ్రాముల గంజాయి, బైక్‌లను సీజ్ చేసి నలుగురు యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మవిశ్వాసమే ఆలంబనగా..

- కాళ్లు చచ్చుబడినా వివిధ పనుల్లో రాణిస్తున్న దివ్యాంగులు
- కంటిచూపు కోల్పోయినా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తున్న అంధుడు ఉమైర్ అహ్మద్
- శక్తికి మించి కష్టపడుతూ ఆదర్శంగా నిలుస్తున్న మరికొందరు

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు ఈ దివ్యాంగులు. వీరిని చూసి అయ్యో పాపం అన్నవారే ఔరా అనేలా వివిధ రంగాలు, వృత్తుల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నవారే చేయలేని పనులు సైతం చేస్తూ ఇటు తమ కెరీర్‌లో ముందుకెళ్తూనే.. కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వారిపై ప్రత్యేక కథనం.


టెన్నిస్ ఆడుతున్న అంధుడు షేక్ ఉమైర్ అహ్మద్

మిర్యాలగూడ: కంటిచూపు కోల్పోయినా జాతీయ టెన్నిస్ క్రీడల్లో రాణిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు ఓ యువకుడు. ప్రమాదవశాత్తు ఒక కన్నును పూర్తిగా కోల్పోయి మరో కన్ను చూపు తగ్గినా.. ఆ యువకుడు ఆత్మవిశ్వాసంతో అంధుల టెన్నిస్ పోటీల్లో పాల్గొని సత్తాచాటుతున్నాడు. మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపునకు చెందిన షేక్ జానిమియా–ఖమరున్నీసా దంపతుల కుమారుడు ఉమైర్ అహ్మద్ 3వ తరగతి చదువుతున్న సమయంలో తలుపు బేడెం కంట్లో గుచ్చుకుని ఎడమ కన్ను చూపు కోల్పోయాడు. దీనికితోడు కుడి కన్నుచూపు తగ్గుతూ వచ్చింది. అయినప్పటికీ ఉమైర్ ఆత్మవిశ్వాసంతో చదువును కొనసాగించాడు. స్నేహితులతోపాటు రికార్డర్ సాయంతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు రికార్డ్ చేసుకుని విని చదువుకునే వాడు. హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో డిగ్రీ, దూరవిద్య ద్వారా పీజీ పూర్తి చేసి ఉద్యోగం సాధించిన ఉమైర్ ప్రస్తుతం మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు.

అంతర్జాతీయ స్థాయిలో ఆడడమే లక్ష్యం



ఒక శబ్దం చేసే బంతిని, ఆ శబ్దాన్ని బట్టి కొట్టడమే అంధుల టెన్నిస్ ఆట. ఇలాంటి ఆట ఆడే నాలాంటి దివ్యాంగులను ప్రోత్సాహించాలి. అంతర్జాతీయ స్థాయిలో ఆడి దేశానికి పతకం తీసుకురావడమే లక్ష్యంగా నిత్య సాధన చేస్తున్నాను.

– షేక్ ఉమైర్ అహ్మద్, మిర్యాలగూడ

అంధుల టెన్నిస్‌లో సత్తాచాటి..

ఉమైర్ తన స్నేహితుల ద్వారా అంధుల క్రీడల గురించి తెలుసుకుని 2019లో ముంబైలో జరిగిన అంధుల టెన్నిస్ పోటీల్లో పాల్గొని బహుమానంగా జపాన్ దేశంలో మాత్రమే లభ్యమయ్యే అంధుల టెన్నిస్ బంతులను రెండింటిని అందుకున్నాడు. వాటితో హైదరాబాద్‌లో నిత్య సాధన చేశాడు. 2020లో పంజాబ్‌లోని పాటియాలలో జరిగిన జాతీయ స్థాయి అంధుల టెన్నిస్ పోటీల్లో తెలంగాణ నుంచి ఒక్కడే పాల్గొని రెండవ బహుమతి సాధించాడు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికై కరోనా కారణంగా వెళ్లలేకపోయాడు. 2024 జనవరి 9, 10 తేదీల్లో గోవా రాష్ట్రంలోని పనాజీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి కరీంనగర్‌కు చెందిన ఇబ్రహీంతో కలిసి పాల్గొని మరోసారి ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ పతకాన్ని సాధించి సత్తాచాటాడు.

పేపర్ బాయ్‌గా..


గుండ్రాంపల్లిలో ఇంటింటికీ సాక్షి దినపత్రికను చేరవేస్తున్న మహేష్

చిట్యాల: పోలియోతో రెండు కాళ్లు చచ్చుబడి నడవలేని స్థితిలో ఉన్న చిట్యాల మండలం గుండ్రాంపల్లికి చెందిన బాతరాజు మహేష్ ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్తున్నాడు. ట్రైసైకిల్‌పై ఉదయం పూట ఇంటింటికీ తిరుగుతూ దిన పత్రికలు పంచుతూ తనకు చేతనైనా పనిచేస్తూ తన కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన రోజువారి కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే బాతరాజు రాములు–లింగమ్మలకు ముగ్గురు కుమారులున్నారు. వీరిలో రెండో కుమారుడు మహేష్. తన చిన్నతనంలో పోలియో బారిన పడి రెండు కాళ్లుచచ్చు పడిపోయాయి. ఇంటర్ మొదటి సంవత్సరంతోనే చదువు మానేసిన మహేష్ అమ్మానాన్నకు ఆసరాగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఏడాది కాలంగా ట్రైసైకిల్‌పై ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులకు 'సాక్షి'తోపాటు ఇతర పత్రికలను చేరవేస్తున్నాడు. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి తనకు ఎలక్ట్రిక్ ట్రైసైకిల్‌ను అందజేయడంతోపాటు ఉపాధి కల్పించాలని మహేష్ కోరుతున్నారు.

కుట్టుపని నేర్పుతూ.. ఉపాధి కల్పిస్తూ..


మిషన్ కుడుతున్న భాగ్యమ్మ

తుంగతుర్తి: వైద్యం వికటించి దివ్యాంగురాలిగా మారిన ఓ మహిళ కుట్టు పనిలో రాణిస్తూ పలువురికి నేర్పుతూ ఉపాధి పొందుతోంది తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన బల్లెం సుశీల్‌రావు తారమ్మ దంపతుల కుమార్తె బల్లెం భాగ్యమ్మ. ఈమె పుట్టిన మూడో ఏటనే అనారోగ్యానికి గురి కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యం చేయించగా వికటించి ఆమె కుడికాలు పూర్తిగా పనిచేయకుండా పోయింది. దీంతో ఆమె వికలాంగురాలిగా మారింది. అయినా ఆమె అధైర్యపడకుండా తన కాళ్లపై తాను నిలబడానే లక్ష్యంతో టైలరింగ్ పని నేర్చుకుంది. ప్రస్తుతం టైలరింగ్ శిక్షకురాలిగా మారి పదేళ్లుగా మహిళలకు శిక్షణ ఇవ్వడంతో పాటు పీస్ వర్క్ ఇచ్చి ఉపాధి కల్పిస్తోంది. దీంతో ఆమె పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

పంక్చర్ షాపు నడుపుతూ జీవనోపాధి


టైర్ పంక్చర్ అతుకుతున్న కిష్టయ్య

మోత్కూరు: చిన్నతనంలోనే పోలియో బారిన పడి కాలు చచ్చుబడిపోయి దివ్యాంగుడిగా మారిన ఓ వ్యక్తి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మోత్కూరు మండలం అనాజిపురం గ్రామానికి చెందిన ముత్తయ్య–నర్సమ్మ దంపతులకు నలుగురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు కిష్టయ్య ఏడాది వయస్సులోనే పోలియో బారిన పడి కుడి కాలు చచ్చుబడిపోయింది. పదో తరగతి వరకు చదువుకున్న కిష్టయ్యకు వివాహమై భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం 30 ఏళ్లుగా కిష్టయ్య స్వగ్రామంలోనే బైకులు, సైకిళ్లు, ట్రాక్టర్లు, లారీలకు పంక్చర్లు వేసే దుకాణం నడుపుతున్నాడు. కిష్టయ్య భార్య కూలి పనులకు వెళుతూ భర్తకు చేదోడువాదోడుగా ఉంటోంది. తాను దుకాణం నిర్వహించుకోవడానికి ప్రభుత్వం సాయం అందించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కిష్టయ్య కోరుతున్నారు.

దివ్యాంగులపైనే పీహెచ్‌డీ చేసి..


నకిరేకంటి అశోక్

రామన్నపేట: లక్ష్య సాధనకు అంగవైకల్యం అడ్డుకాదని నిరూపించాడు రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నకిరేకంటి మల్లయ్య–నర్సమ్మ దంపతుల కుమారుడు అశోక్. ఐదుగురు మగసంతానంలో అందరికంటే చిన్నవాడైన అశోక్ పుట్టుకతో పోలియో బారిన పడి కాళ్లు వంకర్లు పోయాయి. ఆత్మస్థైర్యం కోల్పోని అశోక్ చేనేత కూలి పనులు చేస్తూ పట్టుదలతో ముందుకు సాగుతూ ఇంటర్, డిగ్రీ చదువుకున్నాడు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. దివ్యాంగుడైన అశోక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రాజనీతి శాస్త్రంలో 'పొలిటికల్ పార్టిసిపేషన్ పర్సన్స్ విత్ డిజబులిటీ ఎ స్టడీ ఆఫ్ తెలంగాణ' (రాజకీయాల్లో దివ్యాంగుల భాగస్వామ్యం తెలంగాణలో అధ్యయనం) అనే అంశంపై పరిశోధక గ్రంథం సమర్పించి ఈ ఏడాది మార్చిలో పీహెచ్‌డీ పట్టా పొందాడు. వికలాంగుడైన అశోక్.. వికలాంగుల రాజకీయ భాగస్వామ్యంపైనే పీహెచ్‌డీ చేయడం గమనార్హం.

మరొకరిపై ఆధారపడకుండా..


పవర్ స్ప్రేయర్‌ను రిపేర్ చేస్తున్న గుండు శ్రీనివాస్

పెన్‌పహాడ్: వికలాంగుడైనా.. మరొకపై ఆధారపడకుండా సొంతంగా పవర్ స్ప్రేయర్ పంపు మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన గుండు శ్రీనివాస్. పుట్టుకతోనే పోలియో బారినపడి రెండు కాళ్లు పనిచేయకుండా పోవడంతో దివ్యాంగుడిగా మారిన శ్రీనివాస్ పదో తరగతి వరకు విద్యనభ్యసించాడు. పైచదువులు చదివే ఆర్థిక స్తోమత లేకపోవడంతో అంతటితో చదువు మానేశాడు. అంగవైకల్యం ఉందని చింతించకుండా ఏదైనా ఒక పనిచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని గ్రామంలోనే సొంతంగా పవర్‌స్ప్రేయర్ రిపేర్ షాపు పెట్టుకున్నాడు. కొన్నేళ్లుగా పవర్ స్ప్రేయర్లను రిపేరు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. తనకు ప్రభుత్వం ఆర్థికంగా తోడ్పాటునందించి శ్రీనివాస్ కోరుతున్నాడు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ జట్లకు కోచ్‌గా రామకృష్ణ


రామకృష్ణ

మిర్యాలగూడ టౌన్: మహారాష్ట్ర రాజధాని ముంబైలోని థానేలో ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరగనున్న యోనెక్స్ సన్ రైజ్ 3వ మినీ జాతీయస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్లకు(అండర్–11 బాలబాలికలు) కోచ్‌గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారబోయిన రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కార్యదర్శి గోపీచంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామకృష్ణను నల్లగొండ జిల్లా బ్యాడ్మిటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రశాంత్, పి. నవీన్ అభినందించారు.



నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం వద్ద పోలి పాడ్యమి సందర్భంగా కోనేరులో దీపాలు వదులుతున్న మహిళలు – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

పెళ్లైన మూడు రోజులకే రోడ్డు ప్రమాదంలో మృతి

- భార్యకు గాయాలు

మేళ్లచెరువు: పెళ్లైన మూడు రోజులకే రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మేళ్లచెరువు మండలంలోని రేబల్లె పునరావాస కేంద్రం వద్ద సోమవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన రాసూరి ఉపేందర్(40)కు శుక్రవారం మేళ్లచెరువు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన రత్నకుమారితో వివాహం జరిగింది. సోమవారం సాయంత్రం భార్యాభర్తలు ఇద్దరు కలిసి బైక్‌పై తడకమళ్ల నుంచి వెల్లటూరుకు వస్తుండగా.. రేబల్లె పునరావాస కేంద్రం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న వరి గడ్డి లోడు ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఉపేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రత్నకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- నాగారం మండలం ఈటూరు గ్రామంలో ఘటన


పశువుల కొట్టంలో మృతిచెందిన గీత

నాగారం: గేదె పాలు పితికేందుకు పశువుల కొట్టానికి వెళ్లిన మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ ఘటన నాగారం మండలం ఈటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రగతినగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రగతినగర్‌కు చెందిన గంట రామాంజనరెడ్డి, గీత(49) భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. వారు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. రామాంజనరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో ఉంటున్న పిల్లల వద్దకు వెళ్లాడు. ఆదివారం రాత్రి గీత తన ఇంటి ఆవరణలో ఉన్న పశువుల కొట్టం (రేకుల షెడ్)లో గేదెల పాలు పితకడానికి వెళ్లింది. రేకుల షెడ్‌లోని విద్యుత్ వైరు ఒకటి రేకులకు ఆనుకొని ఉండటంతో షెడ్ మొత్తానికి విద్యుత్ సరఫరా జరగడంతో ఆ విషయం తెలియని గీత రేకులకు అమర్చిన ఇనుప స్తంభాన్ని పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఆమె మృతి చెందిన విషయం ఎవరికీ తెలియలేదు. సోమవారం ఉదయం పాల కోసం ఇంటికి వచ్చిన వారు గమనించి గీత కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఐలయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. ఐలయ్య తెలిపారు.


గీత (ఫైల్)

మంత్రి పర్యటనలో అపశృతి

- ద్విచక్ర వాహనం పైనుంచి పడి ఇద్దరు కార్యకర్తలకు తీవ్ర గాయాలు

మోతె: మోతె మండల కేంద్రంలో సోమవారం రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటనలో అపశృతి చోటుచేసుకుంది. మంత్రి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహిస్తుండగా.. ముందు వెళ్తున్న వారు సడన్ బ్రేక్ వేయడంతో వెనుకనే వస్తున్న వసీం, నవేసాహెబ్ అనే కార్యకర్తలు అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన వారిద్దరిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నల్లగొండ క్రైం: ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం నల్లగొండ డిపో నుంచి డీలక్స్ బస్సు హైదరాబాద్‌కు వెళ్తుండగా.. తన కారుకు సైడ్ ఇవ్వలేదని కారు డ్రైవర్ చిట్టిమల్ల అంజనేయులు నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ సమీపంలో బస్సును ఆపి బస్సు డ్రైవర్ చెరుకు వెంకన్నపై దాడి చేశాడు. సోమవారం బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్టిమల్ల ఆంజనేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు


ఘటనా స్థలంలో లారీ, ఆటో

మఠంపల్లి: మండలంలోని బక్కమంతులగూడెం సమీపంలో సోమవారం ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను బక్కమంతులగూడెం సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆటో ముందుగా వెళ్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లాలితండాకు చెందిన ఆటో డ్రైవర్ రాముడునాయక్ కాలు విరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న చెన్నాయిపాలెంకు చెందిన శిరీషకు కూడా కాలు విరిగింది. మిగతా వారు క్షేమంగా బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు క్షతగాత్రుల కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు.

బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టి..


గాయపడిన యువకులు

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం మొద్దుల చెరువు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన మునగలేటి నవీన్, మునగలేటి మహేందర్ బైక్‌పై సూర్యాపేట వైపు వెళ్తుండగా.. మార్గమధ్యలో మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు స్థానిక ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం

- 100కు డయల్ చేసిన తండ్రి
- వెంటనే స్పందించి కాపాడిన పోలీసులు


శాలిగౌరారం పీహెచ్‌సీ నుంచి భార్యాపిల్లలతో కలిసి బయటకు వస్తున్న ఉపేంద్రాచారి

శాలిగౌరారం: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకునేందుకు ఇంట్లో నుంచి వెళ్లగా.. అతడి తండ్రి ఇచ్చిన సమాచారం మేరకు ఆ యువకుడిని పోలీసులు కాపాడారు. ఈ ఘటన శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబారిపేట గ్రామానికి చెందిన శివకోటి ఉపేంద్రాచారి(30)కి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఉపేంద్రాచారి గ్రామంలో తల్లిదండ్రులతో కలిసి నివాసముంటూ కేబుల్ ఆపరేటర్ పని చేస్తున్నాడు. కుటుంబంలో చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం కూడా గొడవ జరుగడంతో ఉపేంద్రాచారి భార్యను కొట్టాడు. దీంతో భార్య అదే గ్రామంలో ఉంటున్న తన తల్లిగారింటికి వెళ్లింది. భార్యను ఎందుకు కొట్టావని తండ్రి బ్రహ్మాచారి ఉపేంద్రచారిని మందలించాడు. దీంతో తండ్రితో గొడవ పడిన ఉపేంద్రాచారి ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేసి తాను చనిపోతానని చెబుతూ బైక్‌పై బయటకు వెళ్లిపోయాడు. దీంతో వెంటనే బ్రహ్మాచారి 100కు డయల్ చేసి పోలీసులకు విషయం చెప్పాడు. అప్పటికే శాలిగౌరారం మండలకేంద్రానికి చేరుకున్న ఉపేంద్రాచారి మద్యం సేవించి గ్రామ శివారులోని డొంకదారిలో ఓ చెట్టు వద్ద తల బాదుకొని స్పృహతప్పి పడిపోయాడు. ఇంతలో పోలీసులు జానయ్య, దేవేందర్, రవినాయక్, వెంకన్న ఉపేంద్రాచారి సెల్‌కు ఫోన్‌చేయగా స్పందన లేకపోవడంతో ఎస్ఐ సైదులు అందించిన సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ఉపేంద్రాచారిని గుర్తించారు. స్పృహతప్పి పడిపోయిన ఉపేంద్రాచారిని మొదటగా స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రాథమికంగా వైద్యం అందించారు. కొంతసేపటి తర్వాత స్పృహలోకి వచ్చిన ఉపేంద్రాచారిని మెరుగైన వైద్యం కోసం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉపేంద్రచారి కోలుకున్న తర్వాత పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఉపేంద్రాచారి ప్రాణాలు కాపాడిన పోలీసులను గ్రామస్తులు అభినందించారు.